ప్రజాశక్తి

సోమవారం 22 డిసెంబర్ 2025

5

విజయనగరం

అండర్-19 ఖోఖో జట్టు మేనేజర్‌గా రాజు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అండర్-19 ఖోఖో జట్టు మేనేజర్‌గా పివిఎస్ఎన్ రాజు ఎంపికయ్యారు. ఈ నెల 23 నుంచి 28వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్‌లో జరిగే 69వ నేషనల్ గేమ్స్ ఫెడరేషన్ ఖోఖో పోటీల్లో పాల్గొనే రాష్ట్ర బాలుర జట్టుకు ఆయన మేనేజర్‌గా వ్యవహరించనున్నారు. ఆయన గంట్యాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఆయనను జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కమలనాభరావు, కె.గోపాల్, అండర్- 19 సెక్రటరీ పివిఎల్ఎన్ కృష్ణ, సహాయ కార్యదర్శి రాజేష్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ నాయుకులు నల్ల వెంకటనాయుడు, ప్రకాశరావు, విజయనగరం డివిజన్ స్పోర్ట్స్ కార్యదర్శి జి.తవిటయ్య అభినందించారు.

నాగార్జునకే పట్టం

- సమర్థత, విధేయతకు మొగ్గుచూపిన టిడిపి అధిష్టానం
- రెండోసారి అధ్యక్ష పదవి వరించడంతో అనుయాయుల్లో జోష్
- ఆశావహుల్లో తప్పని నిరాశ
- ప్రధాన కార్యదర్శిగా వరప్రసాద్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

టిడిపి అధిష్టానం మరోసారి కిమిడి నాగార్జునకే పట్టం కట్టింది. ఆయనను టిడిపి జిల్లా అధ్యక్షునిగా నియమిస్తూ లేఖ విడుదల చేసింది. జిల్లా ప్రధాన కార్యదర్శిగా ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్‌కు అవకాశం కల్పించింది. ఈ యువ జోడి పార్టీని ఎలా ముందుకు నడిపిస్తుందో వేచిచూడాలి. నాగార్జునకు జిల్లా రాజకీయాలు కొత్తకాదు. తల్లి కిమిడి మృణాళిని వారసత్వంతో రాజకీయాల్లోకి ప్రవేశించిన ఆయనను 2019లోనే రంగంలోకి దింపారు. ఓటమి చవిచూసినా వెరవలేదు. ప్రతిపక్షంలోనూ టిడిపి చీపురుపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పార్టీ కార్యక్రమాలను తనదైన శైలిలో ముందుకు తీసుకెళ్లారు. అక్కడ చురుకైన పాత్ర పోషించడంతో 2020లో పార్టీ జిల్లా అధ్యక్ష పదవిని అధిష్టానం కట్టబెట్టింది. ఈ రెండు బాధ్యతలను సమతూకంగా నెరవేర్చడంతో గడిచిన సాధారణ ఎన్నికల్లో తిరిగి చీపురుపల్లి నుంచి ఎమ్మెల్యేగా బరిలో దింపుతారనే చర్చ కూడా నడిచింది. అప్పటికే జరిగిన జిల్లాల పునర్విభజన కారణంగా గతంలో శ్రీకాకుళం నుంచి కీలక నేతగా ఉన్న కిమిడి కళావెంకటరావు రాజకీయం అనివార్యంగా మన జిల్లాతో ముడిపడింది. సీనియర్‌గా ఉన్న ఆయనను రంగంలోకి దింపాల్సి రావడంతో నాగార్జునను తప్పించాల్సి వచ్చింది. అప్పట్లో నాగార్జున ఒకింత కలత చెందినప్పటికీ అధిష్టానం సూచనలు శిరసా వహిస్తూ వచ్చారు. నిరుత్సాహం చెందకుండా జిల్లా పార్టీని ముందుకు నడిపేందుకు శక్తిమేర పనిచేశారు. ఈలోపు టిడిపి కూటమి అధికారంలోకి రావడం, ఆ తరువాత డిసిసిబి చైర్మన్‌గా నియమించడం తెలిసిందే. దీంతో, నాగార్జునను పక్కనబెట్టి ఇతర నాయకులకు అవకాశమిస్తారన్న చర్చ నడిచింది. కానీ, ఎన్నికలకు ముందు, ఆ తరువాత చోటు చేసుకున్న అనేక రాజకీయ పరిణామాలు నాగార్జునను అటుపోట్ల వైపు నెట్టాయి. అయినా పార్టీకి విధేయుడిగా పనిచేయడం, సమర్థత ప్రదర్శించడం వంటి కారణాలతో తిరిగి రెండోసారి జిల్లా అధ్యక్ష పదవి కట్టబెట్టింది. ఈ నేపథ్యంలో నాగార్జున అనుయాయుల్లో జోష్ నెలకొంది.

టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్ కూడా రాజకీయ కుటుంబం నుంచి వచ్చినవారే. తల్లిదండ్రులు ప్రసాదుల కనకమహాలక్ష్మి, ప్రసాదుల రామకృష్ణ విజయనగరం మున్సిపల్ చైర్మన్లుగా పనిచేశారు. రామకృష్ణ ఒకానొక దశలో పట్టణ రాజకీయాల్లో కీలకంగా ఉండేవారు. వీరి వారసత్వంతో రాజకీయాల్లోకి వచ్చిన వరప్రసాద్ కొన్నేళ్లు పట్టణ కమిటీ అధ్యక్షునిగా కూడా పనిచేశారు. తాజాగా జిల్లా ప్రధాన కార్యదర్శి పదవి వరించడంతో ఆయన అనుయాయులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

టిడిపి బడుగు, బలహీన వర్గాల పార్టీ
ఎమ్‌పి అప్పలనాయుడు

టిడిపి బడుగు, బలహీన వర్గాల పార్టీ అని, ఈ విషయం జిల్లా అధ్యక్షుల నియామకంతో మరోసారి రుజువైందని ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. స్థానిక అశోక్ బంగ్లాలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 25 పార్లమెంట్ (జిల్లా) స్థానాలకు అధ్యక్షులను నియమించగా, అందులో 11 మంది బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారు ఉన్నారని చెప్పారు. పార్టీ పదవుల నియామకాల్లో టిడిపి ఎల్లప్పుడూ సామాజిక న్యాయాన్ని పాటిస్తుందని వెల్లడించారు.

కార్మికుల పక్షాన అక్షర సమరం

పోరాట శక్తులకు అండగా నిలుద్దాం ● శ్రామిక జనకవనంలో వక్తల పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కార్మికుల పక్షాన అక్షర సమరం చేస్తూ, పోరాడుతున్న శక్తులకు సాహిత్యం, రచనల ద్వారా అండగా నిలవాలని కవులు, రచయితలు పిలుపునిచ్చారు. సిఐటియు అఖిలభారత మహాసభకు సంఘీభావంగా సాహితీ స్రవంతి, సిఐటియు సంయుక్త ఆధ్వర్యంలో శ్రామిక జనకవనం కార్యక్రమాన్ని స్థానిక గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం ఏర్పాటుచేశారు. జెవివి రాష్ట్ర నాయకులు వి.రాజగోపాల్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కవి సమ్మేళనంలో ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు ప్రారంభ ఉపన్యాసం చేశారు. సాహిత్యానికి జన్మస్థానం సమాజమే అన్నారు. గతాన్ని గుర్తుచేసుకొని భవిష్యత్‌ను రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నేడు సనాతన ధర్మం పేరుతో జరుగుతున్న విచ్ఛిన్నకర పరిణామాల నేపథ్యంలో సాహిత్యం బాధ్యత మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో కొన్ని దుర్మార్గమైనవి, సరిచేయాల్సినవి, చేర్చాల్సినవి ఉన్నాయని మహాకవి గురజాడ అప్పారావు ఆనాడే చెప్పారని గుర్తుచేశారు. వర్గ రహిత సమాజం మాత్రమే సంఘర్షణలు తగ్గిస్తుందని కార్ల్‌మార్క్స్ చెప్పారన్నారు. దానిని ఆచరణకు రాకుండా దోపిడీదారులు చూస్తున్నారన్నారు. దీనిపై పోరాటాలు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయని చెప్పారు. పోరాడుతున్న కాలంలో ప్రజలలో అవగాహన పెంచడం, చైతన్యం తీసుకురావడం కోసం కవులు, రచయితలు మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందని స్పష్టంచేశారు. పాలకులు వేస్తున్న ముసుగు తీసి ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. దోపిడీ సమాజం గురించి మరింత శాస్త్రీయ సిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.

శ్రామిక జనకవనంలో మాట్లాడుతున్న ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి.వి.రమణ మాట్లాడుతూ సిఐటియు అఖిలభారత మహాసభ ఈనెల 31 నుంచి జనవరి నాలుగో తేది వరకు విశాఖ వేదికగా జరగనుందని చెప్పారు. అందులో భాగంగా ఈ నెల 27 నుంచి జనవరి రెండో తేదీ వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వర్గ, ఆర్థిక పోరాటాలతో పాటు సాంస్కృతిక రంగం ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. రానున్న కాలంలో అభ్యుదయ వాదులు అందరితో ఆలోచనలు కలుపుకొని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు.

ప్రముఖ కవి పాయల మురళీకృష్ణ కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. శ్రీశ్రీ రచించిన 'శ్రమకు ఎవరు ఖరీదు కట్టలేరు' కవితను చెప్పి ఉత్తేజ పరిచారు. ప్రజలు, కార్మికుల పక్షాన కవితలు రాయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రముఖ కవులు కె.శ్రీనివాసరావు, జి.శివరాం, జయపాలరావు, చీకటి దివాకర్ వారి కవితలు ద్వారా కార్మిక వర్గానికి అండగా ఉంటామని చాటిచెప్పారు. మహాసభ విజయవంతం కావాలని కవితల ద్వారా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కవులు, రచయితలు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-బొండపల్లి

పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బొండపల్లి మండలం గొట్లాం గ్రామంలో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రంలో ఆయన స్వయంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారు 2 లక్షల మందికి పోలియో చుక్కలను వేసేందుకు 1172 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఐదేళ్లలోపు వయసున్న చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, వారి భవిష్యత్తును సురక్షితం చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఒక్క చిన్నారి కూడా ఈ చుక్కల కార్యక్రమానికి దూరం కాకూడదని, క్షేత్రస్థాయిలో అధికారులు, ఆరోగ్య కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి శతశాతం లక్ష్యాన్ని చేరుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ పివివి గోపాలరాజు, డిఎంహెచ్ఒ ఎస్.జీవనరాణి, ఎడిఎంహెచ్ఒ కె.రాణి, ఐసిడిఎస్ సిడిపిఒ ఉమాభారతి, వైద్యాధికారి సత్యనారాయణ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

5 ఏళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు

విజయనగరంటౌన్ : ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలను వేయించాలని కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి కోరారు. స్థానిక కంటోన్మెంట్ మున్సిపల్ పార్కులో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి, పిల్లలకు పోలియో చుక్కలను వేశారు. కార్యక్రమంలో కమిషనర్ పి.నల్లనయ్య, డిఎంహెచ్ఒ జీవనరాణి, ఎడిఎంహెచ్ఒ కె.రాణి, డిఐఒ అచ్యుతకుమారి, డిఎన్ఎంఒ అర్చనాదేవి, డాక్టర్ అశోక్‌కుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో చిన్నారులకు కమిషనర్ పల్లి నల్లనయ్య చుక్కల మందు వేశారు.

ఘనంగా ప్రపంచ ధ్యాన దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఉత్తరాంధ్ర అభివృద్ధి ఐక్యవేదిక ఆధ్వర్యంలో నగరంలో ఆదివారం ప్రపంచ ధ్యాన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక అధ్యక్షులు మద్దిల సోంబాబు మాట్లాడుతూ ధ్యానాన్ని దైనందిన జీవితంలో ఒక భాగం చేసుకోవాలని కోరారు. శారీరకంగా, ఆరోగ్యంగా ఉండటానికి, మానసిక ప్రశాంతతను పొందడానికి ధ్యానం ప్రధాన మూలమని చెప్పారు. కార్యక్రమంలో సిరి చందన, సాయి, రమ్య, పృథ్వీ పాల్గొని ధ్యానం ప్రాముఖ్యతను చాటిచెప్పారు.

ఘనంగా పేర్రాజు జయంతి

విజయనగరం కోట : ద్వారం నరసింగరావు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ సొసైటీ ద్వారా నడుపుతున్న రోటరీ దశిగిరి పేర్రాజు మ్యూజిక్ అకాడమీలో ఆదివారం దశిగిరి పేర్రాజు 103వ జయంతి ఘనంగా నిర్వహించారు. డాక్టర్ శ్రీకాంత్, ప్రఖ్యాత విద్వాంసులు బి.ఎ.నారాయణ, తదితరులు పేర్రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం నారాయణ గాత్రకచేరీ అందరినీ అలరించింది. అకాడమీ గౌరవాధ్యక్షులు డాక్టర్ డివి శ్రీకాంత్, రోటరీ క్లబ్ అధ్యక్షులు బి.వి. శ్రీనివాస్, ద్వారం నరసింగరావు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ఉపాధ్యక్షులు గ్రంధి విష్ణుమూర్తి, అకాడమీ అధ్యక్షులు ఎం.అనిల్ కుమార్, డి.బాలాజీ, డాక్టర్ కె ఎ. పద్మప్రియ పాల్గొన్నారు.

వాసవి క్లబ్‌కు అవార్డుల పంట

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ వార్షిక సమావేశం (ఐకాన్)లో విజయనగరం జిల్లా క్లబ్ కు 32 అవార్డులు వచ్చినట్లు ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు ఆత్మకూరి సతీష్ తెలిపారు. క్లబ్స్ ద్వారా సమాజ సేవా కార్యక్రమాలు పర్యావరణ పరిరక్షణ అవగాహన సదస్సులు, విద్య,వైద్యం,వివాహం మొదలగు కార్యక్రమాలు చేయడంలో శ్రద్ధ చూపిన క్లబ్‌లకు అవార్డులు ప్రకటించినట్లు సతీష్ చెప్పారు. శనివారం హైదరాబాద్ లో జరిగిన వార్షిక సమావేశంలో ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఇరుకుల్ల రామకృష్ణ జిల్లా క్లబ్ కు అవార్డులు అందజేశారు. అవార్డులు విభాగంలో క్లబ్ బెస్ట్ ప్రెసిడెంట్ గా విజ్జపు విజయ్ కుమార్, బెస్ట్ రీజియన్ చైర్మన్లు ఎవి కృష్ణారావు, డిమ్స్ రాజు, రీజియన్ సెక్రటరీ రత్నారావు, జోన్ చైర్మన్ మాటూరు శ్రీనివాసరావు తదితరులకు అవార్డులు లభించినట్లు తెలిపారు.

త్యాడ ప్రసాద్‌కు అవార్డు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మదర్ థెరిసా సేవా సంఘం, బ్లడ్ డోనర్స్ క్లబ్, శిష్టకరణం లిఫ్టింగ్ హ్యాండ్ అధ్యక్షులు త్యాడ ప్రసాద్ పట్నాయక్‌కు అవార్డు లభించింది. హైదరాబాద్‌లో శిష్టకరణ లేఖ, ఐక్యవేదిక సంయుక్తంగా అందజేస్తున్న శిష్టకరణ లేఖ వార్షిక అవార్డుల్లో సేవాదళ్ అవార్డును ఆయనకు అందజేశారు. ఈ అవార్డు రావడానికి సహకరించిన మదర్ థెరిసా సేవా సంఘం, శిష్టకరణం లిఫ్టింగ్ హ్యాండ్ సభ్యులకు ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

తోటపాలెం రోడ్డుకు మహర్దశ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

రూ.46 లక్షలతో రహదారి నిర్మాణం

నగరంలోని తోటపాలెం రోడ్డుకు మహర్దశ పట్టిందా? అంటే అవుననే సమాధానం చెప్పాలి. ఐనాక్స్ సినిమా హాల్ జంక్షన్ నుంచి తోట పాలెంలోని వెంకటేశ్వర ఆలయం వరకు 900 మీటర్లు మేర నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నూతన రోడ్డు పనులు శనివారంతో పూర్తయ్యాయి. అనేక ఏళ్లుగా రోడ్డు అధ్వానంగా ఉండటంతో వాహనాల రాకపోకలకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సుదీర్ఘ కాలం తర్వాత రోడ్డు నిర్మాణం చేపట్టడంతో స్థానికులు అభినందనలు తెలిపారు. ప్రధానంగా తోటపాలెం ప్రాంతంలో అనేక ప్రయివేటు జూని యర్, డిగ్రీ కళాశాలలు, పాఠశాలలు ఉండటంతో వందల సంఖ్యలో విద్యార్థులు సైకిళ్లపై, ఆటోలు, బస్సుల్లో చదువుకునేందుకు వస్తున్నారు. రోడ్డు గుమ్ములు, గోతులతో ఉండటంతో స్థానికులు, విద్యార్థులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు రోడ్డు వేయడంతో వారంతా ఆనందం వ్యక్తం చేస్తూ, అభినందనలు తెలిపారు.

కొత్తగా వేసిన తారు రోడ్డు

సమన్వయంతో ముందుకు వెళ్లాలి

ప్రజాశక్తి-విజయనగరంకోట

నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు గంటా పోలినాయుడు, పాశి అప్పల నాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని నారాయణపురం, పడాలపేట గ్రామాల్లో మండల అధ్యక్షులు గంట పోలినాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ప్రతిఒక్కరికి అందేటట్లు చూడాలన్నారు. గ్రామంలో ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి వేచలపు శ్రీనివాసరావు, టిడిపి మండల నాయకులు మజ్జి పైడిరాజు, పడాలపేట సర్పంచ్ సువ్వాడ శ్రీను, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి మండల అధ్యక్షులు గంటా పోలినాయుడు

సామాజిక సేవలో పోలీసులు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

పోలీసులు సామాజిక సేవా భావాన్ని చాటుకున్నారు. మహిళా పోలీసు స్టేషన్ డిఎస్‌పి ఆర్.గోవిందరావు, సిఐ ఇ.నర్సింహమూర్తి, ఎస్ఐలు, సిబ్బంది కలిసికట్టుగా ఆదివారం నగరంలోని ఉపాధి కల్పన కార్యాలయం వద్దనున్న బ్యాంకు కాలనీ పార్కును సుందరంగా తీర్చిదిద్దారు. పార్కులో నిత్యం వృద్ధులు, మహిళలు, ప్రజలు వాకింగ్, జాగింగ్ చేస్తూ, అక్కడ సేదతీరుతూ ఉంటారు. పార్కును చాలా రోజుల నుంచి ఎవరూ పట్టించుకోకపోవడంతో అక్కడికి వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి లైటింగ్ లేక అక్కడ అసాంఘిక కార్యక్రమాలు కూడా జరిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్ ఆదేశాల మేరకు మహిళా పోలీసు స్టేషన్ డిఎస్‌పి ఆర్.గోవిందరావు, సిఐ ఇ.నర్సింహమూర్తి, ఎస్ఐలు, సిబ్బంది కలిసికట్టుగా శ్రమదానం చేశారు. పార్కులో ఉన్న చెత్తను తొలగించి, గుబురుగా ఉండే చెట్టు కొమ్మలను కట్ చేశారు. అక్కడ ఉన్న అబ్దుల్ కలాం విగ్రహాన్ని నీటితో శు భ్రపరిచారు. అనంతరం పార్కులో నాలుగు సిమెంట్ బల్లలు, లైటింగ్ కూడా ఏర్పాటు చేశారు.

పార్కులో చెత్త శుభ్రం చేస్తున్న డిఎస్‌పి గోవిందరావు, సిబ్బంది

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-విజయనగరం

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్క రించాలని న్యాయ వ్యవస్థ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఆదివారం సంఘం ఆధ్వర్యంలో ముడిదాంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ న్యాయవ్యవస్థలో పనిచేసి ఉద్యోగ విరమణ చేశాక ఉద్యోగులు వేర్వేరు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం నుంచి హక్కులు, ప్రయోజనాలను పొందలేక పోతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో అందరి సమస్యలపై, వాటి పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. అనంతరం కొంతమంది విశ్రాంత ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సంగం భగవాన్, తాడి ప్రసాద్, కొల్లి పైడిరాజు, పి.బి.కె.రాజు, ఎస్.కృష్ణమూర్తి, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న సభ్యులు

బాల సంజీవనితో రక్తహీనతకు అడ్డుకట్ట

- పిల్లల ఆలనపాలనకు కేరాఫ్ అడ్రస్ అంగన్‌వాడీలు
- త్వరలో పోస్టుల భర్తీ
- మహిళా రక్షణకు పెద్దపీట
- నిరాశ్రయులకు ఆయుధంగా వన్‌స్టాప్ సెంటర్
- 'ప్రజాశక్తి'తో ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ విమలారాణి ముఖాముఖి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

బాలసంజీవని పథకంతో పిల్లలు, గర్భిణుల్లో రక్తహీనతకు ప్రభుత్వం అడ్డుకట్ట వేస్తోందని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ టి.విమలారాణి అన్నారు. ఈ పథకం ద్వారా ఎంతో విలువైన పౌష్టికాహారాన్ని ప్రభుత్వం తరపున సరఫరా చేస్తున్నామని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలన్నీ నేడు అధునాతన భవనాల్లో ఉన్నాయని, పిల్లల ఆటపాటలకు, ఆలనాపాలనకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయని అన్నారు. ప్రభుత్వ ఆదేశాలు రాగానే జిల్లాలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకులు, మినీ అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని చెప్పారు. మహిళా రక్షణకు కూడా పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. నిరాశ్రయులుగా మారిన మహిళల పాలిట వన్‌స్టాప్ సెంటర్ ఆయుధంగా పనిచేస్తుందన్నారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆమె ముఖాముఖీ ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆమె మాటల్లోనే...

➡ జిల్లాలో మహిళా శిశు సంక్షేమం ఎలా అమలు జరుగుతోంది.?

జిల్లాలో 11 ఐసిడిఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 2206 అంగన్‌వాడీ కేంద్రాలు, 293 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం ఈ కేంద్రాల ద్వారా బాలసంజీవని పథకం కింద శిశువులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్నాం. ప్రస్తుతం 7 నెలల నుంచి 3ఏళ్ల లోపు గల పిల్లలు 4,1078 మంది, 3ఏళ్ల నుంచి 6ఏళ్లలోపుగలవారు 17415 మంది, గర్భిణులు 7093 మంది, బాలింతలు 6457 మంది ఉన్నారు. వీరందరికీ బాలసంజీవని వర్తింపజేస్తున్నాం.



➡ బాలసంజీవని అంటే ఏమిటి.?

గర్భిణులు, బాలింతలలో రక్తహీనత నివారించడానికి, 6 నెలల నుండి 6 ఏళ్లలోపు పిల్లల్లో పోషణ స్థితి మెరుగు పరచడానికి పెట్టిన బృహత్తర పథకం ఇది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నెలకు రూ.249.5 విలువైన పోషణ కిట్ ఇంటికి అందిస్తున్నాం. ఈ కిట్‌లో 250 గ్రాముల బెల్లం, 250 గ్రాముల వేరుశనగ చెక్కీలు, డ్రైఫ్రూట్స్ 250 గ్రాములు, కిలో అటుకులు, 2 కిలోల రాగిపిండి, 5 లీటర్ల పాలు, 25 కోడిగుడ్లు ఉంటాయి.

➡ అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది పూర్తిస్థాయిలో ఉన్నారా.?

సిబ్బంది చాలా వరకు ఉన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు 20, సహాయకులు 86, మినీ అంగన్‌వాడీ కార్యకర్త పోస్టులు 5 చొప్పున ఖాళీలు ఉన్నాయి. వీటి భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 2022-23లో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు కలిపి 155 పోస్టుల వరకు భర్తీచేశారు. ఈ కేటగిరీల్లో ఉన్న వారిలో కొంతమందికి 2023-24లో ఉద్యోగోన్నతులు కూడా ప్రభుత్వం కల్పించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో కూడా సహాయకులకు అంగన్‌వాడీ కార్యకర్తగా ఉద్యోగోన్నతి కల్పించారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

➡ మహిళా రక్షణ చట్టం ఎలా అమలు జరుగుతోంది.?

మహిళల రక్షణ చట్టం 2005 నుంచి అమల్లో ఉంది. ఈ విభాగానికి ఇప్పటి వరకు 1047 ఫిర్యాదులు అందగా ఇందులో గృహహింస చట్టం పరిధిలోకి వచ్చిన కేసులు 878 వరకు ఉ న్నాయి. ఇందులో చాలా వరకు పరిష్కారమయ్యాయి. 169 కేసులు ప్రస్తుతం కోర్టు విచారణ దశలో ఉన్నాయి. మిగిలిన కేసులు జిల్లా రక్షణాధికారి కౌన్సిలింగ్ నిమిత్తం ఉన్నాయి.

➡ వన్‌స్టాప్ సెంటర్ అంటే ఏమిటి.?

వన్‌స్టాప్ సెంటర్‌ను సఖి అని కూడా అంటారు. ఇది హింసకు గురైన మహిళలకు (18 ఏళ్లలోపు, అంతకంటే ఎక్కువ వయసు వారితో సహా) ఒకేచోట వైద్య, చట్టపరమైన, మానసిక సలహాలు, తాత్కాలిక ఆశ్రయం వంటి సమగ్ర సహాయాన్ని అందించే ప్రభుత్వ పథకం ఇది. కుటుంబం, సమాజం, కార్యాలయాల్లో జరిగే హింసల నుంచి రక్షించి, భద్రత, భరోసా కల్పించేందుకు దోహదపడే కేంద్రం ఇది. అత్యవసర పరిస్థితుల్లో 181 హెల్ప్‌లైన్ నెంబర్ సంప్రదించవచ్చు. 2017 నుంచి 2067 కేసులు నమోదు చేయగా, దాదాపు అన్ని కేసులను కౌన్సిలింగ్ ద్వారా పరిష్కరించాం. వన్ స్టాప్ సెంటర్లపై 1763 చోట్ల అవగాహన సదస్సులు నిర్వహించాం. 547 బాల్యవివాహాలను నిలిపివేయగలిగాం. ఇలా అనేక సేవలు ఈ కేంద్రం ద్వారా అందుతున్నాయి.

పోలియో నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - భోగాపురం

పోలియో నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. మండలం పోలిపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఆయన పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గంట్యాడ: 5 సంవత్సరాలు లోపు ఉన్న ప్రతి చిన్నారికీ పోలియో చుక్కలను వేసి పోలియో రహిత సమాజంగా తీర్చిదిద్దాలని ఎంపిడిఒ ఎంపి రమణమూర్తి అన్నారు. ఆదివారం గంట్యాడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గంట్యాడ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం డాక్టర్ వందన, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు: మండలంలోని దత్తి గ్రామంలో పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ సతీష్ పిల్లలకు పోలియో చుక్కలను వేశారు. దత్తిరాజేరు పిహెచ్‌సి పరిధిలో 3,262 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశామన్నారు. కె.కొత్తవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 2076 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్టు డాక్టర్ రఘు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తవలస: వియ్యంపేట పిహెచ్‌సి పరిధిలో పల్స్ పోలియో యాక్షన్ ప్లాన్‌ను రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ కె.రమేష్, ఆర్‌బిఎస్‌కె జిల్లా కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం పరిశీలించారు. పిహెచ్‌సి పరిధిలో సున్నా టు 5 సంవత్సరాల పిల్లలు ఎంత మంది ఉన్నారు? ఎన్ని టీమ్స్ పనిచేస్తున్నాయని ఆరా తీశారు.

ఎస్‌కోట: చుక్కల మందు వేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

వియ్యంపేటలో ఎంపిపి గోపమ్మ, సర్పంచ్ పులిబంటి రాము, వైద్యాధికారి డాక్టర్ గోపాలకృష్ణ, డాక్టర్ సింహాద్రినాయుడు, రామలింగాపురంలో పిఎసిఎస్ చైర్మన్ కోళ్ల శ్రీను, వీరభద్రపురంలో దాసరి కార్పొరేషన్ చైర్మన్ పివి రత్నాజీ, చీడివలసలో ఎంపిటిసి లెంక వరహాలు, సర్పంచ్ చలుమూరి అప్పలనాయుడు, తుమ్మికాపల్లిలో విరోతి కొండలరావు, తుమ్మికాపల్లి గేట్ దగ్గర పిల్లా అప్పలరాజు, నిమ్మలపాలెంలో కొట్యాడ శ్రీనివాసరావు, అప్పన్న పాలెంలో కోన దేముడు పిల్లలకి పోలియో చుక్కలువేశారు.

శృంగవరపుకోట: ప్రజారోగ్య పరిరక్షణ ప్రభుత్వ లక్ష్యమని డిసిఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ అన్నారు. ఆదివారం కొత్తూరు గ్రామంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పోలియో రహిత సమాజం కోసం అందరూ పాటుపడాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. లక్కవరపుకోటలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని పిల్లలకు పోలియో చుక్కలను వేశారు.

భోగాపురం: చుక్కలు మందు వేస్తున్న కర్రోతు

బాడంగి: పలు గ్రామాల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేశామని డాక్టర్ ఆదిత్య అన్నారు. ఐదేళ్ల లోపు వయస్సు కలిగిన పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయడం ద్వారా పోలియో వ్యాధి నివారణ లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ప్రయాణికులు ఎక్కువగా ఉండే ప్రాంతాలు, బస్టాండ్లు, రహదారుల వెంట మొబైల్ బృందాల పోలియో 4వేల మందికి చుక్కలు వేశామన్నారు.

పూసపాటిరేగ: పోలియో రహిత సమాజాన్ని సాధించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని పూసపాటిరేగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ముఖ్యంగా తీర ప్రాంత మత్స్యకార గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి, అక్కడి తల్లిదండ్రులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఆర్. అచ్యుత కుమారి పల్స్ పోలియో కార్యాచరణ ప్రణాళికను వివరించారు. వైద్యాధికారులు డాక్టర్ ప్రమీల దేవి, డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఐదేళ్ల లోపు పిల్లలు మొత్తం 3,500 మంది ఉన్నారని తెలిపారు. ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లతో 20 వైద్య బృందాలను 80 మంది సభ్యులతో ఏర్పాటు చేసి, వారికి ప్రత్యేక శిక్షణ అందించామని వివరించారు.

సంతకవిటి: సంతకవిటి, మండపకురిటి పిహెచ్‌సిల పరిధిలోని మొత్తం 49 పోలియో బూత్‌లలో చిన్నారులకు పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ నాగేంద్ర ప్రసాద్, డాక్టర్ ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహన్ రావు, టిడిపి మండల అధికార ప్రతినిధి, మాజీ ఎంపిటిసి వల్లూరు బాబురావు, నియోజకవర్గం వాణిజ్య విభాగం అధ్యక్షులు వల్లూరు గణేష్, టిడిపి మండల అధ్యక్షులు గట్టి భాను, ఎస్‌సి సెల్ అధ్యక్షులు మన్నెన రమేష్ పాల్గొని పోలియో చుక్కలు వేశారు.

వంగర: మండలంలోని అరసాడలో ఎంపిపి వైస్ చైర్మన్ లచ్చు బుక్క ధనలక్ష్మి, వివిధ గ్రామాలలో తహశీల్దార్ పిన్నింటి రామారావు, ఎంపిడిఒ టి.రాజారావు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో వైద్యశాఖ సిబ్బంది, అంగన్వాడీలు పాల్గొన్నారు.

గుర్ల: తహశీల్దార్ పి.ఆదిలక్ష్మి పాలవలసలో ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సుంకరి రమణ మూర్తి, వైసిపి మండల అధ్యక్షు పొట్నూరు సన్యాసినాయుడు ఆధ్వర్యంలో పోలియో చుక్కలు వేశారు.

చీపురుపల్లి: స్థానిక అంబేద్కర్ కాలనీలో టిడిపి మండల అధ్యక్షులు రౌతు కామునాయుడు ఆదివారం పోలియో చుక్కలు వేశారు. పట్టణంలోని బెల్లాన వీధిలో శ్రీకనకమహాలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు ఆధ్వర్యంలో పోలియో చుక్కలు వేశారు. కర్లాం పిహెచ్‌సి పరిధిలో డాక్టర్లు వైద్య సిబ్బంది పోలియో కేంద్రాలకు చేరుకొని పిల్లలకు పోలియో చుక్కలు అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు బి.రాము, ఆశా వర్కర్ ఎం.విజయ, టిడిపి నాయకులు రౌతు నారాయణరావు, వెంపటాపు లక్ష్మణ్‌నాయుడు, శంకర్రావు, పిన్నిటి దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: పోలియో నివారణకు

వేపాడ: చుక్కలు ముందు వేస్తున్న సిబ్బంది

పూసపాటిరేగ: చిన్న పిల్లకు చుక్కలు మందేస్తున్న ఎమ్మెల్యే మాధవి

ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలను వేసేందుకు మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు కోరారు. స్థానిక జయప్రకాష్ మున్సిపల్ పాఠశాలలో ఆదివారం పల్స్ పోలియోను ప్రారంభించారు. ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్వాడీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని ఆదివారం 3,562 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్టు పిహెచ్‌సి వైద్యాధికారి ఎం.వేణు, అంజనేయులు తెలిపారు. ఆదివారం వేయని వారికి సోమవారం వేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒలు, ఎఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రామభద్రపురం: మండలంలో ఆదివారం జరిగిన పల్స్ పోలియో చుక్కల మందుకు విశేష ఆదరణ వచ్చింది. ఆరికతోట పిహెచ్‌సిలో 23 కేంద్రాల పరిధిలో 2001 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. పిహెచ్‌సి వైద్యాధికారులు అపర్ణ, గాయత్రీల ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో ఉదయం నుంచే ఈ పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో ఇఒ రెడ్డి, పార్వతీస్ పొట్టా కిశోర్, వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. రామభద్రపురం బస్సు కాంప్లెక్స్ వద్ద ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసి పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో రామభద్రపురం పిహెచ్‌సి వైద్యాధికారులు లక్ష్మీ దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని బూరాడ, రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం 98 శాతం పూర్తయినట్టు వైద్యాధికారులు డాక్టర్ రీనా చౌదరి, చందక అనిల్ నాయుడు తెలిపారు. బూరాడ పరిధిలో 2937 మంది పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. చిన్న శిర్లాంలో తహశీల్దార్ కృష్ణలత, వైద్యాధికారిని రీనా కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ సుందరేశ్వరరావు, విస్తరణాధికారి రాధాకృష్ణ, పిహెచ్‌ఎన్ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్ లారీ బీభత్సం

ప్రజాశక్తి - గజపతినగరం

మండల కేంద్రంలో ఆదివారం రాత్రి కంటైనర్ లారీ బీభత్సం సృష్టించింది. వేగంగా వచ్చిన కంటైనర్ లారీ అదుపుతప్పి జనసంచారం ఉండే ప్రాంతంలోకి దూసుకొచ్చింది. విశాఖపట్నం నుంచి పెదమానాపురం వైపు వెళుతున్న ఒక భారీ కంటైనర్, గజపతినగరం చేరుకోగానే ఒక్కసారిగా అదుపుతప్పింది. రోడ్డు పక్కనే ఉన్న 'లక్ష్మి షాపింగ్ కాంప్లెక్స్'లోకి అతివేగంగా దూసుకుపోయింది. ఈ క్రమంలో అక్కడ పార్క్ చేసి ఉన్న ఒక కారుపైకి లారీ ఎక్కడంతో, కారు పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. లారీ వేగానికి షాపింగ్ కాంప్లెక్స్ ముందు భాగం కూడా స్వల్పంగా దెబ్బతింది. సాధారణంగా గజపతినగరం మార్కెట్ ప్రాంతం, రోడ్డుపై ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. అయితే ఆదివారం కావడంతో పాటు మార్కెట్ సెలవు ఉండటంతో జనం తక్కువగా ఉన్నారు. ఒకవేళ సాధారణ రోజుల్లో ఈ ప్రమాదం జరిగి ఉంటే భారీగా ప్రాణనష్టం సంభవించి ఉండేదని స్థానికులు ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి- మెంటాడ

జాతీయ వినియోగదారుల దినోత్సవం -2025 సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన వక్తృత్వ పోటీలలో మెంటాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపించారు. ఇంగ్లీషు మీడియంలో తాడ్డి దీక్షిత ప్రథమ, తెలుగు మీడియంలో దామిశెట్టి వైష్ణవి ద్వితీయ స్థానాలు సాధించారు. డిజిటల్ న్యాయ వ్యవస్థ ద్వారా సమర్థవంతమైన, వేగవంతమైన కేసుల పరిష్కారం అనే అంశంపై మండల స్థాయిలో ఎంపికైన వీరు విజయనగరం సంస్కృత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో విజయం సాధించారు. వీరికి ప్రథమ స్థానానికి రూ.5వేలు, ద్వితీయ స్థానానికి రూ.3వేలు నగదు బహుమతి అందించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వి.రఘురాం తెలిపారు. ఇంగ్లీషు మీడియంలో ప్రథమ స్థానం సాదించిన తాడ్డి దీక్షిత అమరావతిలో ఈనెల 23న జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటున్నట్లు గైడ్ టీచర్ అన్నపూర్ణ తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను ఉప విద్యాశాఖ అధికారి, మండల విద్యాశాఖ అధికారి కె.మోహనరావు, ఎంఇఒ వర్మ, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి - డెంకాడ

స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకున్నట్లు ఎస్ఐ ఏ.సన్యాసినాయుడు తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం పోలీస్ స్టేషన్ పరిధిలో రేడియం స్టిక్కర్లు అంటించామన్నారు. ఒకపక్క ప్రజలకు వాహనదారులకు అవగాహన కల్పిస్తూ రోడ్డు ప్రమాదాల జరగకుండా నివారణకు చర్యలు తీసుకుంటున్నామని, మరో పక్క రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి అక్కడ ప్రమాదాల నివారణకు వివిధ పద్ధతిలో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ రేడియం స్టిక్కర్లు అంటించిన పెద్ద ట్రైలర్లను విజయనగరం రాజాపులోవ జాతీయ రహదారి, జొన్నాడ పైడితల్లి టెంపుల్ వద్ద, విజయనగరం నాతవలస రోడ్డులో కెవిఆర్ జంక్షన్ వద్ద పోలీస్ స్టేషన్ రోడ్‌లోనూ ఏర్పాటు చేశామన్నారు. వాహనదారులు జాగ్రత్తగా నడిపి ప్రమాదాలు నివారించవచ్చని తెలిపారు.

భార్గవ్‌కు ఆలిండియా ఐదో ర్యాంకు

ప్రజాశక్తి- బొబ్బిలి

మండలంలోని గొల్లపల్లికి చెందిన సాధారణ రైల్వే ఉద్యోగి బైరెడ్డి రామారావు, గంగారత్నంల కుమారుడు భార్గవ్ ఐఎన్ఐడిఎం కార్డియాలజీ ఆలిండియా ర్యాంక్ 5, ఎయిమ్స్ ర్యాంక్ 7 సాధించాడు. భార్గవ్ బొబ్బిలిలో అభ్యుదయ స్కూల్లో ఒకటి నుంచి 4, 5వ తరగతి నుంచి పదో తరగతి విజ్ఞాన్ విహార్ గుడిలోవలో చదివాడు. ఇంటర్ నిడదవోలు శశివేలువెన్ను కాలేజీలో ప్రతిభా పరీక్షల ద్వారా ఫ్రీసీటు సాధించి చదువుకొని, తరువాత ఒబిసి ఎయిమ్స్ ప్రతిభా పరీక్షలలో 67వ ర్యాంకు సాధించి భూపాల్ మధ్యప్రదేశ్‌లో ఎంబిబిఎస్ పూర్తి చేశాడు. పీజీ నీట్ 141వ ర్యాంకు సాధించి బెనారస్ హిందూ యూనివర్సిటీ ఎండీ జనరల్ మెడిసిన్ పూర్తిచేసి డిసెంబర్ 19న ఫలితాలలో స్టేజ్ వన్ 7వ ర్యాంకు, స్టేజ్ టు ర్యాంకులు ఎయిమ్స్ ర్యాంక్ 7, కామన్ ర్యాంక్ 5 ఆలిండియాలో స్థాయిలో సాధించాడు.

చదవడం మాకిష్టం

డెంకాడ : స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి మహేష్ నిర్వహించారు. విద్యార్థులచే గ్రంథాలయంలో వివిధ రకాల కథల పుస్తకాలు చదివించారు.

నేడు ఎస్ఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం

బొబ్బిలి : స్థానిక పట్టణంలోని బలిజిపేట రోడ్డులో సోమవారం ఎస్ఆర్ షాపింగ్ మాల్ ప్రారంభించనున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.ఎల్.ఎన్ ప్రతాప్ రెడ్డి చెప్పారు. పట్టణంలో శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్ఆర్ షాపింగ్ మాల్ మొదటి బ్రాంచ్ గాజువాకలో ప్రారంభించామని, బొబ్బిలిలో 14వ బ్రాంచ్ ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కష్టమర్లకు నాణ్యమైన వస్త్రాలను తక్కువ ధరలకు ఇవ్వాలని లక్ష్యంతో ఎస్ఆర్ షాపింగ్ మాల్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. డైరెక్టర్ కేశవరావు మాట్లాడుతూ 14 బ్రాంచులలో 10 బ్రాంచులు ఉత్తరాంధ్రలో ఉన్నాయన్నారు. వస్త్రాలు తయారీదారులు నుంచి కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ఆఫర్లు పెట్టినట్లు చెప్పారు. షాపింగ్ మాల్ ప్రారంబానికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే బేబినాయన, మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు, మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, బుడా చైర్మన్ తెంటు రాజా, మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు, లోకబందు విద్యా సంస్థల అధినేత తూముల భాస్కరరావు, వైసిపి నాయకులు శంబంగి వేణుగోపాల్, సినీ యాక్టర్ అనసూయ హాజరవుతారని చెప్పారు.

బ్లాక్ స్థాయి క్రీడలు విజయవంతం

ప్రజాశక్తి - చీపురుపల్లి

ప్రభుత్వం క్రీడా, యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మై భారత్ కార్యక్రమంలో భాగంగా నవ భారత్ ఫౌండేషన్ అధ్యక్షులు యు.హరి సారధ్యంలో ఆదివారం చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బ్లాక్ లెవెల్ క్రీడా పోటీలు ఘనంగా ముగిశాయి. పోటీలలో భాగంగా షాట్ పుట్, రన్నింగ్, వాలీబాల్, షటిల్ బాడ్మింటన్, ఖో-ఖో తదితర క్రీడలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి చీపురుపల్లి అసెంబ్లీ సహ ఇంచార్జి మన్నెపూరి శ్రీనివాసరావు, చీపురుపల్లి డివిజన్ రెడ్ క్రాస్ సంస్థ అధ్యక్షులు బి.వి. గోవింద రాజులు పాల్గొని జెండా ఊపి క్రీడలను ప్రారంభించారు. క్రీడల నిర్వహణ అనంతరం జిల్లా యువజన సర్వీసుల అధికారి ప్రేమ్ భరత్ కుమార్ విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఆర్‌సి జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మగంటి వంశీ, నాయకులు పి.డి. కె.వేణుగోపాల్, పీడీపిసి స్వరూప్, ఆశయ సంస్థ కార్యదర్శి మీసాల లక్ష్మణ్, జనసేన నాయకులు శిగ మహాదేవ నాయుడు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగదీష్‌కు బంగారు పతకం

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని చిన్నిపాలెం గ్రామానికి చెందిన వనుము జగదీష్ విశాఖపట్నంలో గాయత్రి విద్యా పరిషత్ కాలేజ్‌లో బిటెక్ ఫైనల్ ఇయర్ మెకానికల్ ఇంజినీరింగ్ చదువుతూ ఈనెల 19, 20 తేదీలలో గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి నైపుణ్యం పోటీలో పాల్గొని బంగారు పతకం సాధించాడు. రోబోట్ సిస్టమ్ ఇంటిగ్రేషన్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించి గోల్డ్ మెడల్‌తో పాటు మెరిట్ సర్టిఫికేట్‌ను ఎపిఎస్-ఎస్‌డిసి సిఇఒ జి.గణేష్ కుమార్ చేతులు మీదుగా శనివారం తాడేపల్లిలో జరిగిన స్కిల్ ఇండియా పోటీ ముగింపు వేడుకలో అందుకున్నాడు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తన ఎమ్మెల్యే ఆఫీస్‌లో జగదీష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత నైపుణ్యంపై అభివృద్ధి చెంది తల్లిదండ్రులు గర్వపడేలా వుండాలని అకాంక్షించారు. జగదీష్‌కు ప్రథమ బహుమతి రావడంపై తల్లిదండ్రులు, హర్షం వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- దత్తిరాజేరు

ఆర్థిక సాయం అందిస్తున్న బొత్స

ఇటీవల తమిళనాడు రాష్ట్రం రామేశ్వరం సమీపంలో రోడ్డు ప్రమాదంలో కె.కొత్తవలస గ్రామానికి చెందిన అయ్యప్ప భక్తులు మరణించిన సంగతి తెలిసిందే. బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆదివారం పరామర్శించి ఒక్కొక్క కుటుంబానికి రూ.50వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. భార్యా పిల్లలకు మనో ధైర్యాన్ని అందించారు. చదువుకున్న పిల్లలకు వైసిపి ప్రభుత్వం వస్తే ఆదుకుంటానని భరోసా కల్పించారు. ఆయన వెంట వైసిపి మండల అధ్యక్షులు గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్‌పిటిసి రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపిపి మిత్తిరెడ్డి రమేష్ నాయుడు. నాయకులు మంత్రి అప్పలనాయుడు, చప్ప సత్యనారాయణరెడ్డి, సింహాచలం, మహాదేవ్, ఫణీంద్ర, మజ్జి అప్పలనాయుడు, దత్తి చిరంజీవి, రంభ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

191వ రోజుకు జిందాల్ దీక్షలు

ప్రజాశక్తి- శృంగవరపు కోట

జిందాల్ భూ నిర్వాసితుల దీక్షలు ఆదివారం నాటికి 191వ రోజుకు చేరుకున్నాయి. మండలంలోని బొడ్డవరలో జిందాల్ నిర్వాసితులు చేపట్టిన నిరసన దీక్షా శిబిరంలో ఆదివారం ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పాల్గొని రైతులకు సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందకర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యను కేవలం మండల, జిల్లా రాష్ట్ర స్థాయికే పరిమితం చేయకుండా, దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కూడా నిరసనలు తెలియజేసి జాతీయ స్థాయి దృష్టికి తీసుకెళ్లామని గుర్తు చేశారు. 18 ఏళ్ల క్రితం పరిశ్రమ స్థాపన కోసం భూములిచ్చి మోసపోయిన రైతుల ఆవేదనను దేశవ్యాప్తంగా వినిపించేలా ఈ పోరాటాన్ని సాగించామని చెప్పారు. మొదటి నుంచీ రైతుల పక్షపాతిగా ఉన్న తాను, మండల స్థాయి నుండి రాష్ట్ర, దేశ స్థాయి వరకు అన్ని రాజ్యాంగబద్ధ సంస్థలకు, ప్రభుత్వ పెద్దలకు న్యాయం చేయమని దరఖాస్తులు సమర్పించినట్లు తెలిపారు. భూములు కోల్పోయిన రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు, వారి భూములు వారికి దక్కే వరకు తన మద్దతు కొనసాగుతుంది అని అన్నారు. న్యాయస్థానంలో కచ్చితంగా రైతులకు అనుకూలమైన తీర్పు వస్తుందని, ఎవరూ ధైర్యం కోల్పోవద్దు అని భరోసా ఇచ్చారు.

చిల్లంగి నెపంతో గ్రూపు నుంచి తప్పించారు

పొదుపు సంఘం మహిళ ఆవేదన

ప్రజాశక్తి - చీపురుపల్లి

పట్టణ పరిధిలోని జి.అగ్రహారానికి చెందిన ముత్యాలమ్మ మహిళా పొదుపు సంఘంలో 30 సంవత్సరాలుగా సభ్యురాలుగా ఉంటూ, సంఘంలో ఎటువంటి బకాయిలూ లేకుండా నిత్యం పొదుపుని చెల్లిస్తూ రుణాన్ని చెల్లిస్తూ ఉన్నప్పటికీ తనకి చిల్లంగి ఉందంటూ తనపై లేని ఆరోపణలు చేస్తూ తనను గ్రూపు నుండి తోటి సభ్యులు తప్పించారని దన్నాన అప్పల నరసమ్మ అనే మహిళ ఆదివారం స్థానిక విలేకరుల వద్ద వాపోయింది. ఆమె తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నేను ఎస్‌సి (రెల్లి) కులానికి చెందిన మహిళను కావడంతోపాటు నాకు చిల్లంగి అంటూ నన్ను గ్రూపులో ఉండనీయకుండా చేయాలనే ఉద్దేశంతో గ్రూపు నుంచి తప్పించారు. పొదుపు సంఘం ఆవిర్భావం నుంచి సంఘ సభ్యురాలుగా కొనసాగుతున్నాను. ఇప్పుడు కావాలనే కొంతమంది అగ్ర కులస్తులు గ్రూప్ నుంచి నన్ను తప్పించి ఇటీవల సుమారు 20 లక్షల రూపాయల రుణాన్ని వాడుకున్నారు. నాకు చిల్లంగి ఉందన్న నెపంతో సంఘంలో కొంతమంది మహిళలు అబద్ధపు ప్రచారాన్ని నిర్వహిస్తూ సంఘం నుండి తప్పించారు. ఈ సంఘటనపై చీపురుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను. వెలుగు అధికారులకు కూడా ఫిర్యాదు చేశాను. నన్ను కుల వివక్షతకు గురిచేసిన సభ్యులపైన కులపరమైన కేసులు నమోదు చేసి నాకు న్యాయం చేయాలని అప్పలనర్సమ్మ కోరారు. తనను సంఘం నుంచి తప్పించిన తరువాత సంఘం పేరుతో వాడుకున్న రుణం నుంచి తనకు రుణ మొత్తాన్ని ఇప్పించాలని, తాను దాచుకున్న పొదుపు డబ్బులు కూడా ఇప్పించాలని ఆమె కోరారు. మండల స్థాయిలో అధికారులు తనకు న్యాయం జరపకపోతే జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసి న్యాయం కోరుతానని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ సంఘటన పైన చీపురుపల్లి మండల సమైక్య ఎపిఒ అప్పలనాయుడుని వివరణ కోరగా సంఘ సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ప్రాణం తీసిన పొగమంచు

ప్రజాశక్తి- మెంటాడ

మండల కేంద్రానికి చెందిన బండారి స్వామినాయుడు(35) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మూడు రోజుల పాటు మృత్యువుతో పోరాడి ఆదివారం మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న స్వామినాయుడు బొర్రా గుహలు వద్ద జరుగుతున్న పనుల నిమిత్తం వెళ్లివస్తుంటాడు. ఇందులో భాగంగా ఈనెల 17న బుధవారం రాత్రి బొడ్డవరకు చేరుకునేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా బొండపల్లి మండలం గొల్లుపాలెం వద్ద దట్టమైన పొగమంచు కారణంగా రోడ్డును మలుపును గుర్తించలేక డివైడర్ ఢీకొని పడిపోయాడు. కాలు విరిగి తీవ్ర గాయాలతో రాత్రంతా చలిలో కొట్టిమిట్టాడు. గురువారం ఉదయం జాతీయ రహదారి సిబ్బంది చావుబతుకుల మధ్య ఉన్న స్వామినాయుడును గుర్తించి బొండపల్లి పోలీసులకు సమాచారమిచ్చారు. ఈ నేపథ్యంలో స్వామినాయుడును విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతునికి భార్య గౌరి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ పెద్ద మృతితో ఆ కుటుంబం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. బొండపల్లి ఎస్ మహేష్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుట్టినరోజు వేడుకలకు వచ్చి మృత్యువాత

ప్రజాశక్తి- రేగిడి

వీరఘట్టం మండలం బెజ్జి గ్రామానికి చెందని భాను ప్రకాష్(28) కుటుంబ సభ్యుల జన్మదిన వేడుకలకు విశాఖపట్నం నుంచి పాలకొండ ఆదివారం వచ్చి అక్కడ ఎంతో సంతోషంగా గడిపి విశాఖపట్నం తిరిగి ప్రయాణంలో మార్గమధ్యంలో మృత్యువాత పడిన సంఘటన పలువురిని కలచి వేసింది. పోలీస్ ఇచ్చిన సమాచారం మేరకు రేగిడి మండలం చిన్న శిర్లాం సమీపం పెట్రోల్ బంక్ వద్ద వ్యాన్, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో పార్వతీపురం మన్యం జిల్లా, వీరఘట్టం మండలం బెజ్జి గ్రామానికి చెందిన బొడ్డు భాను ప్రకాష్ అక్కడిక్కడే మృతి చెందారు. పాలకొండ నుంచి ద్విచక్ర వాహనంపై విశాఖ పట్నం వెళ్తున్న భాను ప్రకాష్ రాజాం నుంచి పాలకొండ వెళుతున్న వ్యాన్ ఢీకొన్న సంఘటనలో ద్విచక్ర వాహనంతో పాటు భాను ప్రకాష్ తల శరీర భాగాలు నుజ్జు నుజ్జు కావడంతో అక్కడకక్కడే మృతి చెందాడు. భాను ప్రకాష్ విశాఖపట్నంలో ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తూ కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. ఇతనికి 2024లో వివాహమైంది. భార్య దేవితో పాటు తండ్రి శ్రీనివాసరావు, తల్లి లక్ష్మి ఉన్నారు. కుటుంబాన్ని పెంచి పోషించిన కుమారుడు ఇలా అర్ధంతరంగా కాలం చల్లడంతో ఆ కుటుంబం రోడ్డుని పడింది. మృత దేహం వద్ద కుటుంబ సభ్యుల రోదన మిన్నంటింది. మృతదేహాన్ని పంచనామా చేసి రాజాం ఏరియా ఆసుపత్రికి పోస్ట్ మార్టం కోసం తరలించారు. ఎస్ఐ బాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా జగన్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి- బాడంగి

మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా వైసిపి నాయకులు మండల కేంద్రంలో భారీ కేక్ కట్ చేశారు. పాఠశాల విద్యార్థులకు, ఆస్పత్రిలో రోగులకు పళ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి రామారావు, వైసిపి మండల అధ్యక్షులు శివప్రసాద్, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: వైసిపి మండల అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో సవరవల్లి పంచాయతీ పరిధిలోని ఉప్పాడపేటలో 53 కేజీల భారీ కేక్‌ను కట్ చేసి జగన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భోగాపురం వైస్ ఎంపిపి దంతులూరి సూర్యనారాయణ రాజు, గురునాథరావు, వైసిపి మండల ఉపాధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బైరెడ్డి ఎర్ర అప్పలనారాయణ రెడ్డి, జిల్లా యువజన నాయకుడు సుందర హరీష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: మండల కేంద్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పూలమాలలు వేసి, స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి జగన్మోహన్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడుబాబు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, జెడ్‌పిటిసిలు నెక్కల శ్రీదేవి, తూర్పాటి వరలక్ష్మి, మాజీ ఎంపిపి గొరపల్లి శివ, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, విరోతి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: మండలంలోని గుషిణి పంచాయతీ పరిధిలో చనమల్లపేటలో వైసిపి మండల ఉపాధ్యక్షుడు చనమల్లు తులసిరామ్ ఆధ్వర్యంలో మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు హాజరై కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ల సుధారాణి, జడ్‌పిటిసి, వైసిపి మండల అధ్యక్షులు గదల సన్యాసి నాయుడు, వైస్ ఎంపిపి సారికి వైకుంఠం నాయుడు, మాజీ సర్పంచ్ చనమల్లు మంగమ్మ, చనమల్లు సూర్యనారాయణ, నెల్లిమర్ల రైతు విభాగం అధ్యక్షులు జమ్ము అప్పలనాయుడు, రేగాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: కేక్ కట్ చేసి శుభాకాంక్షలు చెబుతున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ

వేపాడ: మండల కేంద్రంలోని వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద వైసిపి నాయకులు జగన్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, డి సత్యవంతుడు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎస్ వెంకట్రావు, సర్పంచులు, ఎంపిటిసిలు, పాల్గొన్నారు.

వంగర: వైస్ ఎంపిపి కిమిడి ఉమామహే శ్వరరావు ఆధ్వర్యంలో మండలంలోని తలగాం గ్రామానికి చెందిన ఖండాపు శ్రీనివాసరావు, కర్రి రమేష్, వంజరాపు నరేష్, కిమిడి శ్రీనివాసరావు కొనిస రామకృష్ణ రాజాంలో రక్తదానం చేయడంతో వైసిపి నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ తలె రాజేష్ రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్లు అందజేశారు.

బొబ్బిలి: వైసిపి కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ప్రారంభించారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. 52మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు తూముల భాస్కరరావు, శంబంగి వేణు, మున్సిపల్ మాజీ చైర్మన్ సావు మురళీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి సర్కార్‌పై బొత్స నిప్పులు

గరివిడి, చీపురుపల్లి: జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ కూటమి సర్కారుపై నిప్పులు చెరిగారు. గరివిడి వైసిపి కార్యాలయంలో డాక్టర్ బొత్స సందీప్, డాక్టర్ బొత్స అనూష ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మదిన వేడుకలకు బొత్స సత్యనారాయణ హాజరై కేక్ కట్ చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం రాక్షస పాలన సాగుతోందని దానిన అంతమొందించాలని అన్నారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకంపై కేంద్రం చేస్తున్న కుట్రల వెనుక చంద్రబాబు హస్తం స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు. గ్రామీణ పేదలను మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని, కేంద్రం పథకాన్ని నిర్వీర్యం చేస్తుంటే బాబు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపిలు బొత్స ఝాన్సీ, బెల్లాన చంద్రశేఖర్, పార్లమెంట్ పరిశీలకులు కిల్లి సత్యనారాయణ పాల్గొన్నారు..

కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ కళ్యాణి

పుట్టిన రోజు వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

విజయనగరంటౌన్ : నగరంలో మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నివాసంలో వైసిపి ఆధ్వర్యంలో మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోలగట్ల కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారు నాయుడు, నగర అధ్యక్షులు ఆశపు వేణు, ఫ్లోర్ లీడర్ ఎస్.వి.వి రాజేష్ పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని పెద్ద తాడివాడలో మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 53 కేజీల కేకు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు పిన్నింటి తమ్మినాయుడు, డెంకాడ పిఎసిఎస్ మాజీ చైర్మన్ రొంగలి కనక సింహాచలం, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు కోరాడ కోటినాయుడు, వైసిపి నాయకులు లంక లక్ష్మణరావు, బుగత రమణ, మండల ఉపాధ్యక్షుడు బమ్మిడి వెంకటరమణ, జిల్లా అంగ న్వాడీ అధ్యక్షురాలు పత్తివాడ కృష్ణవేణి, ఎంపిటిసిలు జగన్నాథం, రమేష్, నాయకులు రమణ, తదితరులు పాల్గొన్నారు. కొండరాజు పేటలో సర్పంచ్ సరగడ కళ్యాణి, బంగారు రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.